# ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదలకు కారణం ఎవరు?

**2020** నుండీ అన్ని ప్రపంచ దేశాలలోనూ ద్రవ్యోల్బణం ఎక్కువస్థాయిలో వుండి, నిలకడగా వుంటోంది. అదేవిధంగా ధరలు కూడా అనూహ్యంగా విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఫలితంగా అన్ని ప్రపంచ దేశాలలోని సామాన్య ప్రజలు, ఖర్చులు పెరిగిపోయి, ఆదాయాలు చాలక, అవసరాలను కుదించుకొంటూ పడరాని పాట్లు పడుతున్నారు.

ఇలా ఎందుకు జరుగుతోంది? అని ప్రశ్నిస్తే అంతర్జాతీయంగా అన్ని దేశాలలోనూ ద్రవ్యోల్బణము, ధరలు పెరిగిపోతున్నాయి కనుక మన దేశంలోనూ ధరలు పెరిగిపోతున్నాయంటూ, మన పాలకులు సమర్థించు కొంటున్నారు.

నేడు ప్రపంచమంతటా తమ నయా ఉదారవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను అవలంబింపచేసిన, సామ్రాజ్యవాద అమెరికా దేశ రాజకీయ నాయకులూ, ఆర్థికవేత్తలు యీ పెరుగుదలకు ప్రధాన కారణం. కార్మికులు తాము నిలద్రొక్కుకోవటానికి వేతన పెంపు కోసం ఆందోళనలు జరపటం, ఫలితంగా వారి వేతనాలు పెరిగిపోవటం ప్రధాన కారణంగానూ, సరుకులకు డిమాండ్ పెరగటం మరో కారణంగానూ చూపిస్తున్నారు.

ఇందుకు పరిష్కారంగా కేంద్ర బ్యాంకులు వడ్డీరేట్లను పెంచాలనీ, లేబర్ మార్కెట్లో అధిక వేతనాలను యివ్వటాన్ని ఆపివేయాలనీ, అందువలన ఆర్థికవ్యవస్థలో సమతూకం ఏర్పడు తుందనీ వాదిస్తూ తదనుగుణంగా అమెరికా దేశపు ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్లను పెంచటంతో పాటు, కార్మికుల వేతనాలు పెరగకుండా తగు చర్యలు తీసుకొనేట్లు చేసింది.

సహజంగానే, అమెరికా దేశ ఆర్థికవ్యవస్థ, ఆర్థిక విధానాలతో ముడివేసుకున్న మనదేశం లాంటి దేశాలు కూడా మెల్లమెల్లగా అవే విధానాలను అనుసరించి అమలు జరుపుతున్నాయి. అయినా ద్రవ్యోల్బణం, అధిక ధరలు కట్టడి కాకపోగా దినదినం పెరిగిపోతూనే వున్నాయి.

మరొక వాదన ఏమిటంటే, 'ఉద్యోగిత పెరిగితే, కార్మికులకు బేరసారాలాడే శక్తి పెరుగుతుంది' అంటూ అందరినీ నమ్మబలుకుతున్నారు.

అయితే అమెరికా ఫెడరల్ బ్యాంకు అనుసరించే విధానాల వలన - కార్మికులకు ఎక్కువ వేతనాలు యివ్వకుండా నిరోధించటం, దూకుడుగా వడ్డీరేట్లు పెంచుకొంటూ పోవటం వలన, మరొక ప్రపంచ ఆర్థిక మాంద్యం అనివార్యంగా వస్తుంది. అంతేగాక దక్షిణభాగపు ప్రపంచ రాజ్యాల నుండి, యీ వడ్డీ పెంపు వలన పెట్టుబడి వెనక్కి లాక్కోబడుతుంది. ఉదాహరణకు అమెరికా దేశ బ్యాంకుల్లో వడ్డీరేటు పెంచటం వలన, మనదేశం నుండి విదేశీ సంస్థల పెట్టుబడులు (ఎఫ్.ఐ.ఐ.లు) గణనీయమైన మొత్తాలలో వెనక్కు తీసుకోబడి, మనదేశపు ఆర్థిక వ్యవస్థపై హానికరమైన ప్రభావాన్ని కలిగించాయి. ఇందువలనే మనదేశంలోని స్టాక్‌మార్కెట్లు పదేపదే కుప్పకూలి పోవటం జరుగుతోంది.

అమెరికా దేశ ఆర్థికవ్యవస్థ డేటాను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణానికి, అధిక ధరలకు కారణంగా వారు చెప్పే వాదనలని వెల్లడవుతోంది.

అమెరికా దేశంలో నిరుద్యోగిత తగ్గిపోతూ, ఉద్యోగిత పెరిగినా, ఈ అధిక ద్రవ్యోల్బణ కాలంలో వారి నిజ వేతనాలు పెరగటానికి బదులు తగ్గిపోతున్నాయి. దీనర్థం కార్మికుల వేతనాలు పెరగటం వలన ద్రవ్యోల్బణం పెరగటంలేదని. అంతేగాక ఉద్యోగిత పెరగటం వలన కార్మికుల బేరసారాలాడే శక్తి పెరుగుతుందన్నది కూడా అబద్ధం. వాస్తవానికి యీ ప్రపంచీకరణ శకంలో, కార్మికుల బేరసారాలాడే శక్తి చాలా మేరకు తగ్గిపోయిందన్నదే యిందుకు నిదర్శనం. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలో కూడా, ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేయించుకొంటూ, ఉద్యోగావకాశాలు మరో దేశానికి తరలిపోవటం వలన, అక్కడి కార్మికుల బేరసారాలాడే శక్తి తగ్గిపోయింది.

అమెరికాలో క్రూడ్ చమురు ధరలు రెట్టింపుకు పెరగటం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ కారణంతో జి-7 దేశాలు ఆర్థిక ఆంక్షలు విధించటం వలన, ద్రవ్యోల్బణం పెరిగింది. ధరలు పెరిగిపోయాయి. ఉద్రిక్తతలు తగ్గించటానికి బదులు, యిటువంటి ఆంక్షలు విధించటం వలన ద్రవ్యోల్బణం, ధరలు పెరిగిపోతున్నాయి.

అమెరికా దేశ ఫెడరల్ బ్యాంకు వడ్డీరేట్లను పెంచటం వలన, ఆ దేశంలో కూడా ప్రైవేటు పెట్టుబడులు తరిగి పోయాయి. ఫలితంగా ఉద్యోగిత పెరుగుదల అవకాశాలూ తగ్గిపోయాయి.

ఏవిధంగా చూసినా ద్రవ్యోల్బణం పెరుగుదలకు, ధరల పెరుగుదలకూ, కార్మికులకు అధిక వేతనాలు యివ్వడం కానీ, వాడకపు సరుకులకు గిరాకీ పెరగటంగానీ ఎంత మాత్రమూ కాదని, కేవలం సామ్రాజ్యవాద అమెరికా, దాని మిత్ర పెట్టుబడిదారీ దేశాలూ అవలంబించిన విధానాలనీ స్పష్టమవుతోంది.

ప్రస్తుత దశలో, వాణిజ్య-వ్యాపార సంస్థలు, ఖర్చులు పెరిగాయన్న సాకుతో, చమురు ధరలను పెంచటమే, నేడు

పెరిగిన ద్రవ్యోల్బణానికి, పెరుగుతున్న ధరలకూ కారణం. ఇదే అసలు వాస్తవం.

ప్రపంచ దేశాలకు చెందిన కరెన్సీలపై అమెరికా డాలర్ కరెన్సీ ఆధిపత్యం వుండటం వలన, అమెరికా దేశంలో వడ్డీరేట్ల పెంపకం యొక్క దుష్ప్రభావం, అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలపైనా పడింది. అందువలనే మన దేశంతో సహా అన్ని దేశాలలోనూ ద్రవ్యోల్బణం పెరుగుతూ, ధరలు పెరుగుతున్నాయి. అయితే యిందుకు బాధ్యత కార్మికుల అధిక వేతనాలుగా చూపిస్తూ, అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారు.

ప్రపంచ కార్మికవర్గం యీ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాల అసంబద్ధ మోసపూరిత ప్రచారాలను అర్థంచేసుకొని, ప్రభావవంతంగా త్రిప్పికొట్టేందుకు ఉపక్రమించాలి.

**(రోహిత్ అజాద్, ఇంద్రానిల్ చౌదరిల వ్యాసం ఆధారంగా)**

★★★★★